క్లుప్తంగా

21న జాబ్ మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సారథ్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఎన్ఈఆర్ స్కూల్ ప్రాంగణంలో జరిగే ఈ మేళాలో 21 ప్రైవేటు సంస్థలు హాజరై 835 ఖాళీలను భర్తీ చేస్తాయని చెప్పారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, బీ–ఫార్మసీ చదివిన 18–30 ఏళ్ల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ముందుగా 'ఎన్ఏఐపీయుఎన్‌వైఏఎం.ఏపీ.జీవోవి.ఇన్' వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

గేదెల రవికి డాక్టరేట్ పట్టా



ఎచ్చెర్ల క్యాంపస్ : శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) అసిస్టెంట్ ప్రొఫెసర్, వెల్ఫేర్ డీన్ గేదెల రవి డాక్టరేట్ సాధించారు. పార్ట్‌టైం విధానంలో గౌహతీ ఐఐటీలో బయోఫ్యూయల్, న్యూట్రాస్యూటికల్ సమ్మేళనం అనే అంశంలో పరిశోధన చేశారు. ప్రొఫెసర్ వెంకటదాస్ గైడ్‌గా వ్యవహరించారు. వైవా వాయిస్ విజయవంతంగా పూర్తి కావటంతో డాక్టరేట్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ అధికారులు బుధవారం రవిని ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



బహుమతులు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా వద్ద దేవాలయం ఆవరణలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో చిన్నారులకు బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో 95 మంది పాల్గొనగా 25 మంది విజేతలుగా నిలిచారు. జూనియర్ విభాగంలో 68 మంది పాల్గొనగా 12 మంది విజేతలుగా నిలిచారు. వరం స్కూల్ హెచ్ఎం ఇందిరామణి, స్టేట్ ఒలింపిక్ సెక్టర్ పి.సుందర్‌రావులు చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయిక్, ప్రసాద్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు సన్మానం



రైతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మునాయుడు అన్నారు. పొన్నాడలో బుధవారం ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేస్తున్న రైతులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగుల మందులు, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగిస్తే భూమి సారవంతమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో నారాయణపురం సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన



సూచనలిస్తున్న నైస్ ఫౌండేషన్ సభ్యులు

రణస్థలం: ఉపాధి హామీ వేతనదారులు వడదెబ్బకి గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని నైస్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రవితేజ అన్నారు. నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీహెచ్.రాజాం పంచాయతీ బొడ్డపాడులో చెరువు పనులు చేస్తున్న ఉపాధి హామీ పథకం వేతనదారులకు వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. కాటన్ దుస్తులు ధరించాలన్నారు. వడదెబ్బ తగిలినట్లు గుర్తిస్తే వెంటనే ఓఆర్ఎస్ తాగి సమీపంలోని వైద్యులను సంప్రదించాలని, లేదంటే ప్రాణానికి ముప్పు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, ఉపాధి హామీ పథకం వేతనదారులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడి..!

- రోజురోజుకూ పెరుగుతున్న చికెన్ ధరలు
- కిలో లైవ్ చికెన్ రూ.175
- రూ.300కు చేరువైన స్కిన్ లెస్
- గుడ్డుదీ అదే దారి
- వేట నిషేధం కావడంతో పూర్తిస్థాయిలో లభించని చేపలు



కోళ్లు

శ్రీకాకుళం: నాన్‌వెజ్ ధరలు మండిపోతున్నాయి. రోజురోజుకూ రేట్లు ఆకాశాన్నంటుతుండటంతో మాంసాహార ప్రియులు కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్నారు. ముఖ్యంగా చికెన్ ధరలు జిల్లాలో భారీగా పెరుగుతున్నాయి. కిలో లైవ్ చికెన్ రూ.175 ఉండగా, డ్రెస్డ్ చికెన్ రూ.290, స్కిన్‌లెస్ రూ.300కు చేరువగా అమ్ముతున్నారు. జిల్లాలో కోళ్ల లభ్యం కాకపోవడంతో ఇతర జిల్లాల నుంచి, ఒడిశా నుంచి తెప్పిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవానికి ఒడిశాలో ఎప్పుడూ మన రాష్ట్రంలో చికెన్ ధరలు కంటే తక్కువ ఉండడం పరిపాటి. ఇటువంటి తరుణంలో తక్కువ ధరకు అమ్మాల్సిన వ్యాపారులు, సిండికెట్‌గా మారి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సుగుణ, వెన్‌కాబ్ వంటి సంస్థలు రాష్ట్రం వ్యాప్తంగా చికెన్ విక్రయాలు చేస్తున్నాయి. ఇవి అన్ని ప్రాంతాల్లోను ఒకేలా ధరలు నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ మేరకే ధరలు నిర్ణయిస్తున్నప్పటికీ జిల్లా వ్యాపారులు సిండికెట్‌గా మారి ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన అధికారులు ఏ కారణం చేతనో తమకు తెలియనట్లు వ్యవహరిస్తుండడంతో ధరలు దిగి రావడం లేదు.

అమాంతం పెంపు..

గుడ్డు ధర కూడా దిగి రావడం లేదు. హోల్‌సేల్‌లో గుడ్డు ధర రూ.5.50 పైసలు ఉండగా, రిటైల్‌లో రూ.6.50పైసలకు అమ్ముతున్నారు. మటన్(వేట మాంసం) ధర రూ.950పైకి చేరుకోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయలేకపోతున్నారు. చేపలు కొనుగోలు చేద్దామంటే సముద్రంలో వేట నిషేధం అమల్లో ఉండటం వల్ల అంతంత మాత్రంగానే లభ్యమవుతున్నాయి. చేరువు చేపలు వస్తున్నప్పటికి అవి డిమాండ్ తగ్గ స్థాయిలో ఉండడం లేదు. దీనిని ఆసరాగా చేసుకుని, చికెన్ వ్యాపారులు ధరను మరింత పెంచి విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధరలను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

సామాన్యులకు ఇబ్బంది..



మా కుటుంబంలో మొత్తం ఎనిమిది మంది సభ్యులం. చికెన్ ధర అమాంతం పెరిగిపోవడంతో కొనుగోలు చేయలేకపోతున్నాం. గుడ్డు ధర కూడా పెరగడం వల్ల సామాన్యులకు ఇబ్బందే.

– పూజ, శ్రీకాకుళం

ధరలు నియంత్రించాలి



చికెన్ ధర రోజు రోజుకు పెరిగిపోతున్నా నియంత్రించే వారు కరువయ్యారు. 20 రోజుల క్రితం కిలో లైవ్ చికెన్ రూ.120 ఉంటే, ఇప్పుడు రూ.175కు చెరింది. కాయగూరలు కూడా కొనలేని స్థాయికి చేరాయి.

– రూపవతి, గృహిణి, పొందూరు

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే 'రెడ్‌బుక్' అమలు చేస్తారా?

- కూటమి పాలకుల తీరుపై మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, మాజీ మంత్రి, బీసీ నేత విడదల రజిని పట్ల చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు అనుచిత ప్రవర్తన మంచి పద్ధతి కాదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం మెట్టవలస విచ్చేసిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపడం దారుణమన్నారు. కూటమి నేతలు బూటకపు హామీలతో ప్రజల చెవిలో పువ్వులు పెట్టారని దుయ్యబట్టారు. వృద్ధులు, వితంతవులు కొత్త పింఛన్ల కోసం వేచి చూస్తున్నా మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు దోల వెంకటరమణ, గొర్లె శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, బూత్ కమిటీ అధ్యక్షుడు మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఎంపీటీసీ గేదెల నారాయణరావు, ఇ.గోవిందరావు, చిక్కాల ధర్మారావు, డకర సురేష్‌కుమార్, డకర కృష్ణ, లాభాన కన్నంనాయుడు, బాలబొమ్మ శ్రీనివాసరావు మంతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడి మృతిపై ఆందోళన



ఆసుపత్రి ముందు విలపిస్తున్న కుటుంబీకులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో దళిత యువకుడు కొంద్రు త్రినాథరావు (32) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆపరేషన్ విఫలం కావడం వల్లే త్రినాథరావు చనిపోయాడంటూ కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాల్లోకి వెళ్తే.. రణస్థలం మండలం కొండములగాంకు చెందిన కొంద్రు అప్పరావు, తవిటమ్మల కుమారుడైన త్రినాథరావు ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఏప్రిల్ 29న కోటబొమ్మాళి పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా మునసబ్‌పేట వద్ద రాంగ్ పార్కింగ్‌లో ఉన్న లారీని ఢీకొనడంతో గాయపడ్డాడు. వెంటనే నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తీసుకెళ్తామన్నా వినకుండా ఈ నెల 3న సర్జరీ చేశారని, బుధవారం నాటికి చనిపోయినట్లు చెప్పారని కుటుంబ సభ్యులు వాపోయారు. విషయం తెలుసుకున్న స్పెషల్‌బ్రాంచి పోలీసులు మృతుని కుటుంబీకులను కలిసి వివరాలు సేకరించారు. ఆస్పత్రి నిర్లక్ష్యంపై ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఈ విషయమై ఆస్పత్రి యాజమాన్యం వద్ద ప్రస్తావించగా.. సర్జరీ ఫెయిలవ్వడం జరగలేదని, వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదని స్పష్టం చేశారు.

బాలకృష్ణకు మాజీ మంత్రి ధర్మాన పరామర్శ



బాలకృష్ణతో మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ నాయకుడు, న్యాయవాది డాక్టర్ టంకాల బాలకృష్ణ తండ్రి వెంకట్రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఎంపీ దృష్టికి రైల్వే సమస్యలు

జి.సిగడాం: జి.సిగడాం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, ఇంటర్‌సిటీ రైళ్లకు హాల్టు కల్పించాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. ఈ మేరకు బుధవారం మెట్టవలస ఓ కార్యక్రమానికి విచ్చేసిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల విప్ బెవర జగన్నాథం, పలిశెట్టి సూర్యనారాయణ, డబ్బాడ ఆదినారాయణ, జనపాల ప్రసాద్‌బాబు, అప్పన్న, బగ్గు జ్ఞానేశ్వరరావు, కోనా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం



సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న కార్మిక నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. ఈ నెల 20న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెకు సంబంధించిన పోస్టర్లను బుధవారం అరిణాం అక్కివలసలోని స్యాంక్రిగ్ పిస్టన్స్ ప్లాంట్–3 వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు దుర్గాప్రసాద్, సూర్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని పూడివలస, ఇబ్రహింబాద్ గ్రామాల్లో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం సాయంత్రం నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమం నిర్వహించారు. ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇలా వేశారు.. అలా ఎగిరిపోయాయి!



డే అండ్ నైట్ కూడలిలో మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన షేడ్‌నెట్స్



బుధవారం రాత్రికి ఎగిరిపోయిన షేడ్‌నెట్స్

- ఈదురుగాలులకు ఎగిరిపడిన షేడ్‌నెట్స్
- ప్లానింగ్ లేని పనులతో రూ.లక్షలు వృథా

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): భానుడి ప్రతాపం నుంచి వాహనచోదకులకు ఉపశమనం కల్పించేందుకు ఏటా ఏప్రిల్ మొదటి వారంలోనే జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద షేడ్‌నెట్స్ ఏర్పాటు చేసేవారు. ఎండ తగలకుండా ఇవి ఎంతగానో ఊరటనిచ్చేవి. ఈ ఏడాది మాత్రం మే నెల రెండో వారం వరకు షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయలేదు. దీనిపై విమర్శలు రావడంతో ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం గ్రీన్‌మేట్‌లతో హడావిడి పనులు చేశారు. ఇంతలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు వీయడంతో షేడ్‌నెట్స్ ఎగిరిపోయాయి.

నాణ్యత ఏదీ?

వాస్తవానికి షేడ్‌నెట్స్ ఏర్పాటుచేయాలంటే బలమైన ఐరన్‌పోల్స్ వేసి రింగ్‌లు ఏర్పాటుచేసి డబుల్ నెట్స్ కట్టి మధ్యలో రంధ్రాలు పెట్టి గాలికి ఎగిరిపోకుండా ఓ ప్రణాళికబద్ధంగా కట్టాలి. ఇలా కాకుండా రాత్రికి రాత్రి సరైన ప్లాన్ లేకుండా, అధికారుల పర్యవేక్షణ లేకుండానే డే అండ్ నైట్ కూడలి, వైఎస్సార్ కూడలి (ఏడురోడ్లు) కూడలిలో షేడ్‌నెట్స్ ఏర్పాటుచేశారు. ఒక్క రోజైనా గడవకముందే రెండుచోట్ల ఏర్పాటుచేసిన నెట్‌లు గాల్లో కలిసిపోయాయి. ప్రస్తుతం రెండుచోట్ల ఏర్పాటు చేసిన షేడ్‌నెట్స్ విలువ సుమారు లక్ష రూపాయలని సమాచారం. వాస్తవానికి ఒక్కో జంక్షన్‌లో నాలుగువైపులా ఏర్పాటుచేయాల్సి ఉండగా మొక్కుబడిగా ఒక్క వైపే ఏర్పాటుచేసి వదిలేశారు. అదీ నాసిరకం పనులు చేయడంతో బుధవారం వచ్చిన గాలులుకు ఎగిరిపోయాయి. ప్రజాధనం వృథా జరుగుతుండటంతో కార్పొరేషన్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రథసప్తమి వేడుకల సమయంలోనూ అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటులో ప్లానింగ్ ఇంజనీరింగ్ అధికారులు నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. భవిష్యత్‌లో చేసే పనులకైనా సరైన పర్యవేక్షణ, ప్లానింగ్ చేపట్టి ప్రజాధనం వృథాకాకుండా చూడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కొత్త భద్రమ్మతల్లి వారాలు



నగరంలో హడ్కోకాలనీలో కొత్త భద్రమ్మతల్లి మూడో వారం ఘనంగా నిర్వహించారు. తొలి పూజ ఉదయం 3 గంటలకే ప్రారంభించి ముగ్రాటలతో అమ్మవారికి చల్లదనం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. హడ్కోకాలనీ, భారతీనగర్, ఆర్.కె.నగర్, ప్రభాకర్‌నగర్ కాలనీ, శాంతినగర్‌కాలనీల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి భద్రమ్మ తల్లిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారిని మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పొంచి ఉన్న ప్రమాదం



అరసవల్లికి వెళ్లే రోడ్డులో తోట జంక్షన్ వద్ద బ్యాంకర్స్‌కాలనీ – జామి తోటలకు వెళ్లే రహదారికి ఆనుకుని ఉన్న కాలువ ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు వద్ద చిన్నారులు, వృద్ధులు రాత్రివేళ అకస్మాత్తుగా పడిపోయి గాయపడుతున్నారు. కార్లు, ఆటోల్లో వచ్చేవారు సైతం మలుపు వద్ద కాలువ కనిపించక దిగబడిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

తీరప్రాంత గ్రామాల్లో పల్లెనిద్ర



ఎచ్చెర్ల క్యాంపస్: మత్స్యకారులతో మాట్లాడుతున్న పోలీసులు



గార: మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

ఎచ్చెర్ల క్యాంపస్: బడివానిపేటలో కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఎస్సై జి.హరికృష్ణ, సిబ్బంది బుధవారం పల్లెనిద్ర నిర్వహించారు. చేపల వేట నిషేధం అమలును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజ్ఞాత వ్యక్తులు తీరంలో కనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1093, సెల్: 9392914712కు సమాచారం తెలియజేయాలని కోరారు.

గార: తీర ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలని కళింగపట్నం మెరైన్ స్టేషన్ సీఐ బి.ప్రసాదరావు అన్నారు. మంగళవారం రాత్రి బలరాంపురం మత్స్యకార గ్రామంలో పల్లెనిద్ర చేపట్టారు. విదేశీ బోట్లు, మానవ అక్రమరవాణా, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, డ్రగ్స్ రవాణా వంటి కార్యకలాపాలు జరిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1093కు తెలియజేయాలన్నారు. బుధవారం ఉదయం వరకు స్థానిక పాఠశాలలోనే నిద్రించి ఉదయం తీరప్రాంతంలో పర్యటించారు.

తలసేమియా రోగులకు రక్తమార్పిడి



శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి బంగ్లా వద్ద అనురాగ నిలయం మేడపై ఇటీవల ప్రారంభమైన తలసేమియా రక్తమార్పిడి కేంద్రంలో నలుగురు రోగులకు బుధవారం రక్తమార్పిడి చేశారు. పేషెంట్లకు ఉచితంగా పౌష్టికాహారం, ప్రయాణ ఖర్చులు అందజేస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు తెలిపారు.

పత్రికా పఠనంతోనే విజ్ఞానం

శ్రీకాకుళం అర్బన్: పత్రికలు, పుస్తకాలు చదవడం ద్వారా చిన్నారుల్లో విజ్ఞానం పెరుగుతుందని రిసోర్స్ పర్సన్ పైడి శ్రీరామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం పత్రికా పఠనం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో నీతికథలు చదివించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, సిబ్బంది రామ్‌మోహన్, గణేష్ పాల్గొన్నారు.

అనాథలకు వస్త్రాల వితరణ



పిల్లలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న వ్యవస్థాపకులు

శ్రీకాకుళం: శ్రీకాకుళంలోని శాంత అనురాగ నిలయం వృద్ధులకు, అనాథ పిల్లలకు హెల్పింగ్ హ్యాండ్ సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రంజిత్‌కుమార్, కె.పి.నాయుడులు బుధవారం వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా దుస్తులు వితరణ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు లక్ష్మునాయుడు, గౌరీ శంకర్, అనిల్‌కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- భారీ వర్షంతో విద్యుత్‌కు అంతరాయం
- ప్రజలకు తప్పని పాట్లు



కత్తెర వీధి ఫీడర్ ద్వారకానగర్‌లో విద్యుత్ వైర్లపై కూలిన భారీ చెట్లు



జలమయమైన పొట్టిశ్రీరాములు కూడలి

అరసవల్లి: అకాల వర్షం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకుండా చేసింది. బుధవారం మధ్యాహ్నం నుంచే మేఘావృతమై తీవ్ర గాలులు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ శాఖాధికారులు సరఫరా నిలిపివేశారు. వర్షం ఆగిన తర్వాత విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆదేశాల మేరకు ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు, టెక్నికల్ ఈఈ సురేష్‌కుమార్‌లు విద్యుత్ ఓ అండ్ ఎం సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ముందుగా నగరంలో విద్యుత్ అంతరాయానికి కారణమైన ప్రధాన కూడళ్లను గుర్తించి విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టారు. నగరంలో కత్తెరవీధి ఫీడర్‌లో చిన్నబజార్ వీధి, ద్వారకానగర్, వీధులతో పాటు బలగ తదితర ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడం, తిలక్‌నగర్‌లో ఓ చెట్టు కూలిపోవడంతో ఏకంగా నాలుగైదు విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. బుధవారం సాయంత్రం విద్యుత్ శాఖ డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉంగటి పాపారావు బృందం అప్రమత్తమై పునరుద్ధరణ పనులు చేపట్టారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు వాన నీటిలోనే నడుచుకుంటూ రాకపోకలు సాగించాల్సి వచ్చింది. డే అండ్ నైట్ కూడలి, కృష్ణాపార్కు, రైతుబజారు కూడలి, పాతబస్టాండ్ వద్దనున్న పొట్టిశ్రీరాములు కూడలి, కిన్నెర కూడలి తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చాలా గ్రామాలు అంధకారంలో మగ్గిపోయాయి. మూడు రోజులుగా సాయంత్రం ఈదురు గాలులు సమస్యగా మారాయి.